తీర్పు

★

శ్రీ కలపటపు రామగోపాలరావు

ఆ కేసు మహేశంగారికే విచిత్రంగా తోచింది. రాజమహేంద్రవరం లాంటి మహాపట్నంలో చోరీ నేరాలకి కొదవని కాదు. తన అయిదేళ్ల మేజస్ట్రేటు గిరీలోనూ రకరకాల గొడవలు చూశాడు. ముద్దాయి ఆడదవడం కూడా ఆయన అనుభవంలో కొత్తకాదు. అయితే, "దండం దశగుణం భవేత్" అన్న పద్ధతిలో 'పీనల్ కోడ్' వొప్పుకున్నంత శిక్షలు విధించుకుంటూపోయాడే గాని, నేరానికి వేరే కారణాన్ని గురించిన జిజ్ఞాస యెన్నడూ బాధించలేదాయన్ని. ఏ షికారుకి వెళ్లినప్పుడో, సంధ్యాలంకరణలోని గోదావమ్మ ముందు గుండె కోర్టుకెక్కి అలాంటి ప్రశ్న రేగినా, "సంచితకర్మ", "డబ్బుపాపిష్ఠి" అన్న సంజాయిషీలతో బాటు తన బ్రతుకులో పతనాలు స్ఫురించేవి. చటుక్కున యింటికెళ్లి, భగవద్గీత పారాయణతో, మళ్ళీ తెల్లారితే మామూలు దినచర్యకి మనస్సు సంబాళించుకునేవాడు. కాని, యిప్పుడీ 'గంగమ్మ కేసు'లో—

చోరీ అయినది డబ్బు కాదు. పైన వేసివున్న వెలనిబట్టి, "ఆరువందలరూపాయల విలువగలఆస్తి"గా ఫిర్యాదులో వుటంకించబడినా, సామాన్యులు లోభపడే వస్తువు కాదు. అందులోనూ, ఎంత చీకటి బాటయినా, బహిరంగ ప్రదర్శనంలోనించి కేవలం ఒక పెద్ద చిత్రం చేతబట్టుకుని చక్కాబోయిందంటే, ఓ పట్టాన నమ్మకం పుట్టేది కాదు. కాని "చోరీ ఆస్తి"తో పరారవుతూ వుండగానే పట్టుబడిందట. చీరకొంగున మూటలో పాతనోట్లు—ఏభై రూపాయలుకూడా దొరికాయట. పోలీసుని చూడగానే, ఆ పటం పారేసి పారిపోలేదు సరిగదా "బాబూ, నా ప్రాణం—నాది" అంటూ యేవో వెర్రికేకలెట్టిందిట!—ఇదంతా చెబుతూ ఇనస్పెక్టరు వీరాస్వామి- "ఆ! - ఆ పటం గిల్టు చట్రం లేదండీ, అది బంగారమని ఆశపడి వుంటుంది—దొంగముండ!—ఆ రొఖ్ఖం ఎక్కడ కొట్టేసిందో—లేకపోతే, సంపాయించిన బాపతో!—" అని పదేళ్ల పోలీసు అనుభవంతో పత్తాతేల్చేశా డొక వెకిలినవ్వుతో—

మహేశంగారా సంజాయిషీకి పెదవివిరిచేశాడు మొదట. కాని, ఆయన ఆలోచనాతరంగాలలో అదే మాట పదేపదే—వరదలలో మోడుపైన సర్పం లాగ—పడగెత్తి బుసలుకొడుతూ వచ్చింది. అయినా ఎన్నడూ లేనిది, యీ చిన్న కేసు విషయంలో తన కింత మథన యెందుకని, మనస్సు మళ్లించుకోడానికి చూశాడు.

ఆ మూడో నాడే విచారణ. విచారించడాని కేముంటుం దయినా—దిక్కులేని బికారిది—వేరే వకీలా, వాదనా?—వీరాస్వామి "ఛార్జిషీటు," ఆ యిద్దరు పోలీసు జవానుల వాఙ్మూలాలు—అంతా ఓ గంటలో తెమిలిపోతుం దనుకున్నాడు.

కాని, ముద్దాయి తరఫున నారాయణమూర్తిగారు వకాలతు పుచ్చుకున్నా డనడంతోటి, మహేశంగారి ఆశ్చర్యం మరింత యెక్కువయింది! దిక్కులేని దన్నారే, అంత డబ్బెక్కడ పొయ్యగలిగింది?- "క్రిమినలు సైడు పెద్దచెయ్యనిపించుకుంటున్న మూర్తిగారిలాంటి చిల్లర కేసు పట్టాడంటే, ఎంత డబ్బో-అంతకంటె మరే ప్రబలకారణమో-వుండాలి!—

* * * *

అటువంటి కారణం వుందో లేదో గాని, మొదటిరోజు 'క్రాసు' లోనే మూర్తిగారు తన ప్రతిభ చవి చూపించాడు—

"ఆ వేళ, నీది ఎక్సిబిషన్ డ్యూటీ—అంటే ఎన్నింటివరకు?"

"రాత్రి ఎనిమిదిన్నర వరకూ నండి—"

"అయితే, చోరీ జరిగిందన్న సమయం - ఏడున్నర ప్రాంతాలలో - నువ్వు డ్యూటీలోనే వున్నావు?—"

"చిత్తం"

"అంటే, హాలు బయటా, లోపలా—నువ్వు మామూలుగా వుండేది?"

"బయటేనండి—గేటు దగ్గిర—"

"ఎన్ని గేటులున్నాయా హాలుకి?—"

"ఒకటేనండి—ముందు వేపు—"

"జనం వెళ్లాలన్నా, రావాలన్నా అదే త్రోవ—?"

"అవునండి—"

"అయితే, చూడు నూటడెభైమూడూ, సుమారు రెండడుగుల పొడవూ, అడుగున్నర వెడల్పూ వున్న పటంతో—ఒక ఆడమనిషి పారిపోతూన్నప్పుడు, నువ్వు గేటుదగ్గిర—త్రోవలోనే—వున్నావు!—అయినా, అక్కడికి దాదాపు అరమైలున్న పెద్ద మసీదు దాకా తరిమితే గాని ఆ ఆడమనిషిని అందిపుచ్చుకోలేకపోయావు!—క్రిందటేడు, పోలీసు పందాలలో 'రన్నింగురేసు' ఫష్టుప్రైజు నీకేగా వచ్చింది?—"

"చిత్తం, అవునండి!—అదే-అంటే-ప్రైజు నాకే వచ్చిందండి—కాని, అప్పుడు—కాస్త కాఫీ కని-గేటు వదిలి అవతలి కెళ్ళానండి!—"

"ఓహో, అలాగా కాఫీహోటలు గేటు కెంత దూరం వుందేం?—"

"అంటే...గేటుదగ్గిరే ఒకటుందండి!—కాని, నేను—"

"అక్కడికి వెళ్లలేదు-అరమైలు అవతలవున్న సెట్టి హోటలు బాగుంటుందని-కప్పు కాఫీకోసం-డ్యూటీ వదలి అంతదూరం వెళ్ళావు!—"

బోను దిగేసరికి, నూటడెభైమూడుకి ముచ్చెమటలూ పోశాయి. రెండో జవాను, రెండువందల పదిహేనుకి—మరీ కొత్తవాడవడంచేత కాబోలు—వణుకే పట్టుకుంది. కాఫీకి వెళ్లకపోయినా, మొత్తం మీద ఆ సమయానికి గేటుదగ్గిర లేనట్టు మొదటే వొప్పుకున్నాడు. పరుగెత్తుతూ పడిపోయిన గంగమ్మకి-పటం లాక్కునే సందర్భంలో-ప్రక్కలో నాలుగు లాఠీపోట్లు తగిలినట్టు కూడా తేలిందతని క్రాసుపరీక్షలో—తర్వాత, ఇనస్పెక్టరు వీరాస్వామి, తన మూడోసాక్షి - రామశాస్త్రి అనే ఆయన్ని-బోనెక్కించాడు. "దేవుని ఎదుట ప్రమాణం చేసి—" అతగాడు "ప్రత్యక్షంగా తాను చూసినవ"ని కొన్ని సంగతులు చెప్పాడు—

సుప్రసిద్ధాంధ్ర చిత్రకారుడు, దామెర్ల రామారావు వర్ధంతి సమితి కార్యదర్శిగా, తానే చిత్రకళా ప్రదర్శనం యేర్పాటుచేశాడు. మామూలు ప్రకారం, ఆఖరిరోజు సాయంకాలంకూడా అక్కడే వున్నాడు. మూసే టైము కావస్తోంది. జనంకూడా ఎవరూ లేరు. తాను, హాలులో తిరుగుతూ, అమ్ముడయిన చిత్రాలూ, పొరుగూళ్లు పంపాలిసినవీ, వివరాలు నోటుచేసుకుంటున్నాడు. గేటుదగ్గిర మనిషి ఎవరినో టికెట్టు అడగడం వినిపించింది. అటు చూసేసరికి రెండణాలు బల్లమీద పడేసి హడావుడిగా జొరబడుతోంది గంగమ్మ. అంతక్రితం, ఎక్సిబిషను నాలుగు రోజులూ కూడా హాజరవుతున్న దేనని గుర్తించాడు. మొదటిసారి ఆవిడ కూడా వచ్చిన మనిషి-ఎవరో గోపాలంగారట-ఒకటి రెండు చిత్రాలనిగురించి చాలా వివరాలడిగాడు. అంతసేపూ, ఆ పెద్ద కళ్లు వప్పజెప్పి, గంగమ్మ ఆ చిత్రందగ్గిరే నిలిచివుంది. చామనచాయ శరీరం, తెల్ల చీరా, నొక్కి దువ్విన తలా, మసగ వెన్నెలలో మందారపుష్పం స్ఫురించిందట రామశాస్త్రికి. ఆ దరిమిలా ఎప్పుడూ అంత శోభస్కరంగా కనిపించలేదు. ఎప్పుడొచ్చినా, గంటల తరబడి, ఆ వొక్క చిత్రందగ్గిరే వుండిపోయేది. ఎక్సిబిషన్ మూసే వేళయి, పొమ్మనేవరకూ వదిలేది కాదు. ఆఖరి రోజునకూడా, తాను "టైమయిపోయిం" దంటే, "బాబూ, కాస్సేపు!—కాళ్లు లాక్కుపోతున్నా"యని ఆ చిత్రానికి ఎదురుగానే కూలబడింది. హాలులో వెలుగుతున్న దీపం కాంతి కంటే, ఆరిపేసిన దీపాల చీకటే ఎక్కువగా వుంది. అదే తెల్లచీర—నలిగి మాసిపోయింది. రవిక చిరిగివుంది. రేగిపోయిన ఆ జుట్టూ, గుంటలుపడి చింతనిప్పులలాగ కణకణలాడుతున్న కళ్లూ, కన్నీళ్లతో తడుస్తున్న చెక్కిళ్లూ—రామశాస్త్రి కావాలకం చూస్తే వళ్లు ఝల్లుమందా సమయంలో. అంతట్లో, గేటుదగ్గిర మనిషెందుకో కేక వేస్తే తానటు వెళ్లాడు. తర్వాత, అతడి నేదో పనిమీద యింటికి పంపించి, తాను ముందు వరండానానుకునివున్న ఆఫీసుగదిలో, ఏవో లెక్కలు చూసు

కుంటూ వుండిపోయాడు. అరగంటయిందో, నలభై నిముషాలయిందో—మళ్ళీ తాను హాలులోకి వెళ్లేటప్పటికి—ఆవిడ లేదు. బల్లమీద ఆ చిత్రం లేదు! గమ్మున గేటువగ్గిరికి పరుగెత్తి, నలుగురూ నాలుగు వేపులా గాలించారు. ఫలితం లేక, తాను ఎక్సిబిషన్ హాలుకి తిరిగొచ్చిన మరో పావుగంటకల్లా, ఇనస్పెక్టరుగారొచ్చి, పటంతో సహా దొంగ పట్టుబడిందని, ఫిర్యాదు దాఖలు చెయ్యడానికని, తనని స్టేషనుకి తీసుకెళ్ళారు.

ఇలాగ, రామశాస్త్రి వాఙ్మూలం అయాక, నారాయణమూర్తిగారందుకున్నాడు—

"శాస్త్రిగారూ, ఆఖరిరోజున ఆవిడ వాలకం చూసి, వళ్లు ఝల్లుమందన్నారు - అంటే మీకు భయం వేసిందనా?—"

శాస్త్రి కొంచెం యికిలిస్తూనే, "అబ్బే, అంటే ఝుడుసుకున్నానని కాదు—కాని, ఆ చింపిరి తలా, వెర్రిచూపులూ—మసగ వెల్తుర్లో చూస్తే - ఏమిటో-"

"గమ్మున చీకట్లో పిచ్చిది యెదురైతే, కెవ్వుమన్నట్టయింది—అంతేనా?"

"అవునండి! సరిగ్గా అప్పటి నా మనస్థితి చెప్పారు—"

"అంటే, ఆవిడమనస్థితీను!-కోర్టువారీ విషయం ముఖ్యంగా గమనించాలని మనవి—శాస్త్రిగారూ, మరొక్క సంగతి—పటంతో మనిషి పట్టుబడిందని చెప్పడానికి, యినస్పెక్టరుగారే స్వయంగా వచ్చారన్నారు—ఏ జవానుచేత కబురెట్టినా సరిపోయేది గదా?—"

"సరిపోయేది—కాని, స్నేహితుడి నోసారి చూసినట్టూ అవుతుందని వచ్చారనుకోకూడదా?—"

"అనుకోవచ్చు - అసలు ఆయనకీ మీకూ స్నేహం అన్న సంగతి తెలిసివుంటే!—అయితే పోయిన వస్తువు దొరికినా, కేసు నడపాలన్న పట్టుదలకి కూడా, యీస్నేహమే కారణమయిందని అనుకోవచ్చునా?"

"యువర్ ఆనర్ - అబ్జెక్షన్ !"—అంటూ యినస్పెక్టరు వీరాస్వామి చర్రున లేచాడు—"సాక్షి యీ ప్రశ్నకి జవాబియ్యవలసిన అవసరం లేదు."

కోర్టువారా అభ్యంతరం అంగీకరించినమీదట మూర్తిగారు మళ్లీ సాక్షివైపు తిరిగి—"సరే, శాస్త్రిగారూ!—ఆ రాత్రి కలుసుకున్నప్పుడు, ఇనస్పెక్టరుగారిదివరకే ముద్దాయిని యెరుగున్నట్టేమీ చెప్పలేదా?"

ఇనస్పెక్టరు తిరిగీ అభ్యంతరం చెప్పబోయాడుగాని, కోర్టువారీ ప్రశ్న బేసబబు కాదని తీర్మానించారు. శాస్త్రి, యినస్పెక్టరుని చూస్తూ, కొంత నసుగుడుగానే—

"ఎరుగుండడం అంటే—వెనక కొన్నాళ్ళపాటు యిన్నీసు పేటలో యిరుగుపొరుగునే వున్నారట—ఆ మనిషి ప్రవర్తనంత మంచిది కాదన్నట్టు చెప్పారంతే—"

"అసలావిడ ప్రవర్తన వూసెందుకొచ్చిందో, సెలవిస్తారా?"

"బాగుందండి!—భలానా మనిషి పట్టుబడిందంటే, ఆ మాటమీదా మాట వస్తుంది—"

"శాస్త్రిగారూ! నిజమే చెబుతామని ప్రమాణం చేశారు. నిజంగా, జరిగిన మాటలు జరిగినట్టు చెప్పమని కోరుతున్నాను—"

ఆ మాటల్లో తీవ్రతకి శాస్త్రి కనుబొమలు ముడివడ్డాయి - కళ్లు రెపరెపలాడాయి—"అంత చెప్పకూడని మాటలేం రాలేదు. ఏదో దిక్కులేనిదని నేను జాలిపడితే, 'దిక్కులేకపోవడమేం ఖర్మం? - దానికున్న ధీమా పొగరూ నీకేం తెలుసు' నని హెచ్చరించారు—"

"ఓహో, అలాగా! ఆ విషయం యినస్పెక్టరుగారికి తెలుసునన్నమాట!-థాంక్స్, శాస్త్రిగారూ, అంతే" అని మూర్తిగారు కూచున్నాడు.

ఆ రోజుకి విచారణ ముగిసింది. మేజస్ట్రేటు పీఠం దిగి వెళ్లినవాడు, కళ్లజోడుకోసం మళ్లీ తానే తిరిగొచ్చాడు. ఆ రావడంలో బుట్టతలపాగా అవతల తన గదిలో మరిచిపోయాడు. పలచని క్రాపు, బుట్టమీసాలూ, పచ్చని ముఖం నలభయ్యోపడికి యిటే వున్న మనిషి, కళ్లజోడు తీస్తుంటే వేళ్లు వణికాయి. ఆయన కుర్చీవెనకాల, గోడమూలనున్న బూజు సంజవెలుగుపడి మెరిసింది. గోదారిగాలి తిరిగి కోర్టుగదిలో దుమ్మురేగింది.

ఎవరో పెద్ద మనిషి, కోర్టుగుమ్మం దగ్గిరే మూర్తి గారికి దణ్ణం పెట్టి కారుదాకా ఆయన వెంటబడ్డాడు.

"చూడండి గోపాలంగారూ, వచ్చే హీరింగుకైనా ఆవిడ కోర్టులో హాజరు కావాల్సి వుంటుంది— ఎలా వుంది జ్వరం?" అని మూర్తిగారడిగారు.

"పొద్దున్న చూస్తే మూసిన కన్ను తెరవటం లేదండి—రేపటి హీరింగుకి, ఏమో, కష్ట మనుకుంటాను—"

"రేపెలాగో కాదనుకోండి - నాకూ సెషన్సు కోర్టులో పనివుంది—వాయిదా తీసుకుందాం—"

"బొత్తిగా, మందుకూడా తాగటం లేదట—"

"అయ్యో పాపం, మరేం భయం లేదని, కాస్త నచ్చజెప్పి తాగించాలి గాని ఎలాగ?..."

"భయం కాదు బాబూ, ఆ పటం కోసం!— అహోరాత్రాలు ఒకటే వెర్రిపేలాపనట - లాకప్ పహరాజవాను, పిల్లలగల వాడేమో పాపం, ఆ బాధ చూడలేక, నిన్న రాత్రి రహస్యంగా ఆ పటం పట్టుకొచ్చాడట్టోసారి. అది చూసి ముద్దులాడుతూ, ఓపట్టాన వదిలింది కాదుట—"

"పాపం, ఆ తల్లిగుండె—"అని మూర్తిగారలా కారు నానుకునే ఓ క్షణం పరధ్యానంలో పడ్డాడు.

"బెయిలుకేమన్నా ప్రయత్నం చేస్తే—"అని గోపాలంగారు సందేహించాడు.

"చెయ్యొచ్చు—కాని, సరియైన హామీ—"

"నేను సరిపోతానా అండి?"

"మీరా!" అని మూర్తిగారాశ్చర్యపడ్డాడు. "ఎవరోపరాయిమనిషికోసం ఎంతమారం సిద్ధపడతాడాయన?" అన్న సందేహంతో పరిశీలిస్తున్నట్టుంది ఆయన బొమముడిపాటు.

"ఈ మహేశంగారు ఎంత పిసినిగొట్టో అంత భయస్థుడుట—ఏ మూడు నాలుగొందలో డబ్బే ధరావతు కావాలనొచ్చు—అదీగాక, కీడెంచి మేలెంచమన్నారు, తీరా విడిపించాక, ఆ మనిషి ఎటొచ్చి ఎటుపోయినా, మధ్య మీరు అనవసరంగా యిరుకున పడిపోతారు—"

"అయ్యోరామా, అటువంటి మనిషి కాదండి— మొదటే చెప్పానుకదూ—"

"అహ, అందుకు కాదు—కాని, చూడండి, యీ రోజుల్లో ఒక కడుపున పుట్టినవాళ్ల మధ్యనే యెన్నో విపరీతాలు చూస్తున్నాం—కాలం అలాంటిది!—అందుకని, ఏదో మొదటినించీ మీ కుటుంబం అంటే వున్న అభిమానంకొద్దీ, నాకు తోచింది చెప్పాను—మరోలా భావించకండి—"

"ఎంత మాటండి!—ఈ గొడవలో మీ సహాయమే లేకపోతే, ఎప్పుడో ముగిసేది ఆవిడ కథ— చిన్నప్పుడే తల్లినీ, జ్ఞానంవొచ్చేసరికీ వొక్క తోబుట్టువునీ పోగొట్టుకున్న యీ నిర్భాగ్యుడికి, దేవుడు చూపించిన యీ చెల్లెమ్మ కూడా కరువయి పోయేది—"

ఆ కంఠంలో గద్గదిక, గంగమ్మంటే ఆయన గుండెకి యెంత దగ్గిరో, అవగాహన చేసింది. క్షణం ఆగి, గోపాలంగారు, మళ్ళా అన్నాడు—

"మీ ప్రతిష్ఠకితగిన కేసు కాకపోయినా, మీరు నడుంకట్టారంటే, నే నివ్వగలిగిన ముష్టిఅరవై రూపాయలకోసమనా?—నా మీద అభిమానంతోబాటు, 'అయ్యో, నిర్భాగ్యురాలే' అన్న జాలీ, వుపకార చింతా, ఎంతో వున్నాయని నాకు తెలుసు—మీరన్నట్టు, ఎంత కలికాలం కొట్టుకుపోతున్నా, ధర్మచింత యింకా పూర్తిగా చావలేదు—మీలాంటి సత్పురుషులే అందుకు తార్కాణం—"

ఆ మాటలు మూర్తిగారి అంతరాత్మని కలచాయి. ఒకప్పుడు, తాను వీధిలాంతర్లకింద చదువుకుంటున్న రోజులలో, అన్నం పెట్టి ఆదరించిన గోపాలంగారి తండ్రి జ్ఞాపకం వచ్చాడు. కాలచక్రానికి వొక పెడపట్టుకుని తాను పైకొచ్చాడు. పడుతున్న ఆకుమీద వుండిపోయి, గోపాలంగారి కుటుంబం అధోగతిని పడింది—ఆయన, స్కూలు మేస్టరయాడు. ఆ బడిపంతులిచ్చిన అరవైరూపాయిలూ, మొదట అక్కరలేదన్నా—తాను పుచ్చుకున్నాడు. ఆ రూపాయలంత 'ముష్టివి'గా ఎన్నడూ తోచలేదీ క్షణంలోతప్ప—

*   *   *   *

గోపాలంగారి హామీమీద, బెయిలు దరఖాస్తు పెట్టడం, ప్రాసిక్యూషను పట్టువల్ల అది కొట్టివెయ్య బడడం కూడా జరిగాయి. మరో పరిణామం,

గంగమ్మ కేసా వూరి ప్రజాశంఖంలో ప్రధానవిశేషం అయింది.

'ప్రతి బుధవారం ప్రకటించబడే' ఆ 'ప్రజా పత్రిక'కి, సంపాదకుడూ, విలేఖరీ, సర్వసిబ్బందీ అయిన శ్రీనివాసాచారి చేతుల్లో ఓ యాభై రూపాయలు చేరినప్పుడే — లేకపోతే, మరో అచ్చాఫీసులో అరువు దొరికినప్పుడే — తప్ప, బుధవారం రాదన్న సంగతి ఆ వూరివారికి చిరకాలానుభవమే — అటువంటి దీసారి, అదనపు పేజీలతో 'ప్రత్యేక సంచిక' వెలువడింది! — "విద్యార్థులపైన తుపాకి కాల్పులు,' 'కరువురాక్షసి కరాళనృత్యాలు' అన్న వార్తా వ్యాసాలతోబాటు, 'కాంగ్రెసు పోలీసుల ఘన కార్యం' అన్న శీర్షికతో ఆ విచారణ వివరాలు 'మన ప్రత్యేక విలేఖరి' నించి అచ్చయాయి. "ద్రౌపదికి కృష్ణపరమాత్మలాగ, అనాథ అనుకున్న గంగమ్మ రక్షణకి నారాయణమూర్తిగారు నడుం కట్టాడ"ని ఆయన ప్రతిభా విశేషాలు ప్రత్యేకంగా వుగ్గడించబడ్డాయి. పత్రిక కొని చూసిన కొద్దిమందిదగ్గరా, పేజీలు చింపుకు చూసినవాళ్ళూ — అసలేమీ చూడకుండా ఆనోటా ఆనోటా వినిపించినవాళ్ళూ ఎక్కువయి, ఒక కోర్టులో వాయిదాపడ్డ 'కేసు' వంద కోర్టులుగా వీధులలో విచారణ సాగింది. అప్పా, ఆలీ, అమ్మా కాని ఆడ దెవరోకదా అని, ఆకతాయిలు నోటికొచ్చినట్టు మాట్లాడారు.

గంగమ్మతోబాటు, అదే యింట్లో అద్దెకుంటూ, ప్రస్తుత కష్టసమయంలో ఆదుకుని పనిచేస్తున్న గోపాలం మేస్టరుకూడా (ముగ్గురుపిల్లల తండ్రి అయినప్పటికీ), యిలాగ ప్రజలనోళ్లలో పడక తప్పింది కాదు. గోరుచుట్టుమీద రోకటిపోటన్నట్టు, గంగమ్మ బ్రతుకిలా రచ్చనిపడినందుకే ఆయన చాలా నొచ్చుకున్నాడు. దానికితోడు, 'లోకులు కాకుల'ని ఎంత తెలిసినవాడయినా, చివరికి హెడ్మాస్టరుకూడా ప్రత్యేకంగా కబురెట్టి 'స్కూలు ప్రతిష్ఠ' పురస్కరించుకుని, నాలుగు అనేసరికి, నీరవుడయాడు గోపాలంగారు. దిక్కులేని యెన్నో కొంపలలో మళ్లీ దీపంపెట్టిన ఆ విద్యాసంస్థ మూలవిరాట్టు వీరేశలింగం స్మరణకొచ్చి, ఆయన వుత్తేజితుడయాడు. గుండెకట్లు తెంచుకొస్తున్న కోపం, దుఃఖం, గొంతులో బిగబట్టి, "మీరూ నన్ను శంకిస్తే, యింక యిక్కడ పనిచెయ్యడం కష్టం — సంస్థకి భంగం అన్నప్పుడు, వ్యక్తిపోవడమే ధర్మం — ఆవిడ విషయంలో నా కర్తవ్యం అనుకున్నది చెయ్యకతప్పదు- కాని, తల్లికి వసంతంపట్టే దౌర్భాగ్యణ్ణిమాత్రం యింకా కాలేదు —" అని గదిలోంచి చర చరా బయటపడ్డాడు. ఆ రోజునే గోపాలం మేస్టరి రాజీనామా వుత్తరం హెడ్మాస్టరుకి చేరింది.

కాని మర్నాటికల్లా, ఆయన వుద్వేగం కొంత తగ్గి, వున్న సంసార పరిస్థితులు కొట్టొచ్చినట్టుగా, గోపాలంగారి మనస్సుని కలవరపెట్టసాగాయి. తెల్లారితే, కేసు ఫైనలుహియరింగనగా, మూర్తిగారెందుకో సాయంకాలం షికారుకి వచ్చినప్పుడోసారి కలుసుకోమంటే బయలుదేరాడు. తాలూకాఫీసు వీధినే గోదావరి గట్టువైపు నడుస్తున్నాడు. లోగడ వానలకి పొంగిన మురికికాలవలు మ్యునిసిపలు రాజకీయాలలాగే ముక్కలు బ్రద్ధలు కొడుతున్నాయి. 'గమ్మున అలాగ వుద్యోగం వొదులుకోడం తొందరపడ్డానేమో' అనుకున్నాడాయన...ఛా, అంత లేసి మాటలన్నవాడికింద ఎలా పనిచెయ్యడం యింకా?...ఏ ప్రయివేట్లు చెప్పుకున్నా రోజెడుతుంది...అసలా వూరినించిపోయి, మరోచోట ఏదయినా ప్రయత్నించవచ్చు...ఇక గంగమ్మ మాత్రం ఎలా ఉంటుందక్కడ? ఆవిడవల్లనేగదా, అసలు గొడవంతాను?...పాపం, ఆవి డేం చేసింది?...సగం మతిపోయి, జైలులోపడి మగ్గుతోంది...

గట్టెక్కాడాయన - హోరున వరద గాలి కొడుతోంది. నాసికనించి పాపికొండలవరకూ, రకరకాల బహూకరణలు పోగుజేసుకొచ్చిన గౌతమి, సాగరసమాగమయోగం దగ్గర బడిందన్న సంతోషంతో, పరవళ్లు తొక్కుతూ పరుగెడుతోంది. అప్పుడే, మబ్బునించి వెలువడ్డ అస్తంగతభానుడి పరామర్శకి, స్మశానాల రేవులో రెల్లుదుబ్బులు సహితం పులకించి జలజలమంటున్నాయి —

ఆ రేవులోనే గంగమ్మ తనకి మొదట తటస్థపడ్డ దృశ్యం జ్ఞాపకం వచ్చింది గోపాలంగారికి — రెండేళ్ల క్రితం - అంతకంటె చీకటిపడ్డ సమయం - తాను, స్నానానికి వెడుతుంటే, అవతలగా ఆడగొంతు, ఏడుపు, వినిపించి పరుగెత్తేసరికే, కాస్తలో ప్రమాదం తప్పింది - నా అనేవాళ్లు లేక, సంఘానికి వెలిఅయి

కూడా, కొడుకుకోసమే బ్రతుకు భరించిందట - లోకుల కది పాపిష్ఠికొనుపయినా కన్నకడుపుకి ఆ శిశువే సర్వప్రపంచమూ అయాడు. ఆ పిల్లవాడి మీదనే ప్రాణాలన్నీ పెట్టుకుని, వాడికోసం వంటలు చేసింది. పై పనులు చేసింది. గంటలకొద్దీ సంతోషంతో కష్టించింది...ఏదో అల్కామని పనుకుని, వీరాస్వామిలాంటి అల్పబుద్ధులు అన్యథా ప్రవర్తించబోతే, తగిన బుద్ధిచెప్పి తన శీలం కాపాడుకుంటూ వచ్చింది..."నా కన్నా, నా దుర్గా-నువ్వు పెద్దవాడివయి, అమ్మ బాధ లెప్పుడు తీరతాయ"ని ఆ పిల్లవాడితో చెప్పుకేడిచేది......కాని, ఏ దేవుడి కళ్లు కుట్టాయో, అయిదేళ్లయినా నిండకుండా ఆ వొక్క ఆశాకూడా అంతంఅయిపోయింది. మశూచకంట!...ఇంక తనకు యిల్లేమిటని, అంతక్రితం తన దుర్గయ్యని మట్టిపాలుచేసిన ఆ స్మశానాలరేవులోనే తానూ వాడికి తోడు వెడదా మనుకుందిట - "కాని, అన్నయ్యా, నిన్ను చూపించి, నాకా ఒక్కతోవాకూడా మూసేశాడు దేవుడు" అని చాలాసార్లు తన కష్టాలు చెప్పుకుంటూ వాపోయేది గంగమ్మ - అలాగ, ఆవిడ ఆత్మహత్యా ప్రయత్నం తప్పించిన ఘడియ మొదలు, ఆనాటి కానాడు తన కెక్కువ ఆప్తురాలవుతూ వచ్చింది-కుటుంబంలో మనిషయిపోయింది. ఆమధ్య రెండోవాడికి కలరా తగిలి, ఆసుపత్రిలో పడ్తేసే, అహోరాత్రాలు ఒక్కతే వాడి మంచం కనిపెట్టుకుని బ్రతికించింది...ఇదెక్కడి ఋణానుబంధమో అనుకున్నాడు గోపాలంగారు—

అవతల పడవలరేవులో, మామూలు షికారు జనం, కొబ్బరికాయల బస్తాలమీద 'క్లబ్బు'లు సాగిస్తున్నారు. బహుశా, తన పేరూ గంగమ్మ పేరూ కలిపి, వావీవరసా లేకుండా వుచ్చరిస్తూ వుంటారు - ఆ చెల్లెమ్మ కడుపు దుఃఖం మరిపించడానికి, బ్రతుకంటే కొత్త వుత్సాహం కల్పించడానికి, తాను ఎన్నో బోధలు చేశాడు - బాధలు పడ్డాడు. తన పిల్లలని ముస్తాబు చేసేటప్పు డావిడ ముఖంమీద చిరునవ్వు చూసి, మరిచిపోయిందనే అనుకుంటూ వచ్చాడు—ఆ ఎక్సిబిషన్‌లో మళ్ళీ ఆవిడా చిత్రం చూసిన ఘడియవరకు - ఆ పిల్లవాడు కూడా లోకమోహనంగా వున్నాడు. ఆ గిరజాలజుత్తూ, చంపకు చారెడు కళ్లూ, ఆ బుల్లినోరూ, కొంటె చిరునవ్వూ, చిన్న బొజ్జా—చూస్తే, ఎవరో యీ కాలపుభావాల చిత్రకారుడు, బాలకృష్ణుడిని మామూలు బాలుడుగా చూపించా డనుకున్నాడు - 'బాబు' అని పేరెట్టి ఆ చిత్రం వ్రాసినాయన ఎవరో కృష్ణమూర్తిట - యీ మధ్యనే పైకొస్తున్న చిత్రకారుడుట!—ఆ నాలుగురోజులు తానేదో సారస్వత సభల గొడవలో వుండిపోయి, గంగమ్మ సంగతి కనిపెట్టలేదు—తర్వాత, తన భార్యే చెప్పింది - ఎప్పుడో దాచుకున్న ఏభైరూపాయలూ అడిగి తీసుకుందిట గంగమ్మ...ఆవిడకున్న ఏకైక ఆభరణం, బంగారు రేకు మురుగులుకూడా చేతిని వున్నట్టు లేదట!—పాపం, ఆ పటంకోసం, ఎంత యమయాతన పడివుండాలో!...తన కొడుకు పోలికనుకున్న చిత్రం, చూడగా చూడగా తన కొడుకేననే భ్రమ కలిగించి వుండాలి - దేవుడు చూపించా డనుకున్న అన్న కూడా దరిద్రుడేనని తెలిసి, ఆ డబ్బుకోసం పిచ్చిగా ప్రయత్నించి వుండాలి...కాని, యిల్లలికి పండగ అవుతుందనుకున్నట్టయిందా ప్రయత్నం...

కాని, విచిత్రం, ఆ తల్లి కళ్లనికూడా మరిపించగల పోలి కెలా వచ్చిందా చిత్రంలో? - అదే సందేహం, తర్వాత కలుసుకున్నప్పుడు వేళ, మాటలలో మూర్తిగారు కూడా అడిగాడు - 'పిల్లలంతా ఓలాగే వుంటా'రని వెనక గంగమ్మకి చెప్పిన సమాధానం కంటె ఎక్కువ చెప్పలేకపోయాడు గోపాలంగారు - మూర్తిగారు తల పంకిస్తూనే,

"ఆ బొమ్మ గీసిన కృష్ణమూర్తి, పూర్వం ఆవిడకి తెలిసినవాడేమో?"

"నే నెరగని 'పూర్వం' ఆవిడ జీవితంలో లేదనుకుంటాను - ఆ ఘట్టాలన్నీ నా కళ్లకి కట్టినట్టుగా మనస్సులో హత్తుకుపోయాయి"

"అయితే, నా వూహ పొరబాటే!—"

"మొదట నేనూ అనేక అపోహలు పడ్డానండి- కాని, తెలుసుకున్నకొద్దీ, ఆవిడ నిర్మలాంతఃకరణ నాచేత చేతులు జోడింపజేసింది. ధర్మసూక్ష్మం కానలేని గ్రుడ్డిసంఘం, ఆభాసలే పాప పుణ్యాలుగా భ్రమించే అలవాటు చొప్పున, ఆ అమాయకురాలిని నానా హింసలూ పెట్టింది" అని గోపాలంగారు, గంగమ్మ పూర్వకథ చెప్పాడు—

అసలావిడ పేరు గంగామహలక్ష్మి - చిన్నప్పుడు, 'మహలక్ష్మి' అనేవారట!-రామచంద్రపురం

దగ్గిరేదో పల్లెటూరట!-డబ్బుకి ఆసించి, తల్లిదండ్రులా పిల్లని రెండో పెళ్లివాడికిచ్చారు. రెండేళ్లు తిరగకుండానే...ఆభర్త హఠాత్తుగా 'బర్మాజ్వరం' వచ్చి మరణించాడు. అప్పటికి పదహారేళ్లు నిండని మహాలక్ష్మికి జుట్టు తీసెయ్యాలన్నారు. ఎవరో, ఆవిడ భర్త తాలూకు దూరపు బంధువు—పాతికేళ్లకుర్రాడు—పోట్లాడి ఆ ప్రయత్నం మానిపించాడు. అలా ఏర్పడ్డ గౌరవం కొద్దీ, దరిమిలా అతగాడు పలకరించినప్పుడు మాట్లాడిందావిడ. అసలా పెళ్లి పెళ్లేకాదని, జీవితం అలా అడవికి గాచిన వెన్నెల చెయ్యడం దేవుడివుద్దేశం కాదనీ, క్రమంగా అతడు ఎన్నో బోధలు చేశాడు. తాను పెళ్లిచేసుకుంటానని, రాజమండ్రీలో అలాంటి వివాహాలు చేసే సంస్థవుందనీ నచ్చజెప్పాడు. అతడిని పూర్తిగా నమ్మిందావిడ. పెళ్లి అయినా ఖాళీగావున్న భర్తృస్థానంలో అతడి మూర్తి తనహృదయంలో ప్రతిష్ఠించుకుని మురిసింది. యవ్వనోద్రేకంలో అతని కోరికలకి ఆత్మార్పణ చేసింది. నెలలయిన కొద్దీ ఆవిడ బ్రతుకు దుర్భరం అయింది. అతడు క్రమంగా కనిపించడం మానేశాడు. వాళ్లవాళ్లకీ విషయం తెలిసి ఆవూరునించి తీసుకుపోయి వేరే పెళ్లి చేశారుట!

ఇంట్లో వెధవాడబడుచు ఒకావిడ ప్రొద్దస్తమానం నానా హింసలూ పెడుతుండేదట. ఆ దుర్గడికేం, మగమహారాజు, ఏంచేసినా చెల్లుతుందని ఆవిడ చాలా సార్లన్నదట—అంతకుమించి, తన బ్రతుకింత చేసిన వాడి వయినం గంగమ్మకి తెలియదు. తెలుసుకుందామన్న యోచన కూడా తోచలేదావిడకి. ఎలాగో యింట్లోనించి గెంటెయ్యాలని ఆ వెధవాడబడుచే గట్టి ప్రయత్నం చేసిందట—'అంత పనీ చేసేవారే అన్నయ్యా—కాని, నాకు జబ్బు చెయ్యడం, వొళ్లు తెలియని స్థితిలో ఆసుపత్రిలో పడెయ్యడం, వాళ్లకాశ్రమ తప్పింది. అప్పుడైనా పోయింది కాదీ పాడు ప్రాణం? అదేమిటో నాకు మాత్రం యింకా బ్రతకాలనే వుండేది సుమా!' అంటూవుండేది గంగమ్మ. అక్కడ ఒక 'నరుసమ్మ' దయవల్ల, తల్లీ పిల్లవాడూ, ఒక ఏడాది జీవించారుట. ఆ నరుసమ్మ చివరికి పెళ్లి చేసుకు వెళ్లిపోతూ, యాభై రూపాయలా పిల్లవాడి చేతుల్లో పెట్టి కళ్లమ్మట నీళ్లెట్టుకుందిట—"మళ్లీ నిన్ను చూస్తే ఆ నరుసమ్మ జ్ఞాపకం వస్తుందన్నయ్యా" అని చెబుతూ, ఆ సంఘటనంతా ఒక పెద్దకలగా తోస్తుందనేది గంగమ్మ— తర్వాత ఆవిడ కథ మీకిదివరకే తెలుసు" నని గోపాలంగారూరుకున్నాడు.

ఇద్దరూ గట్టెక్కేసరికి మునిసిపలు దీపాలు చీకట్లని సూచిస్తున్నాయి. మూర్తిగారు కారులో కూచుంటూ అన్నాడు—"చూడండి గోపాలంగారూ మన తరఫున మీరు మొదటి సాక్షి కావాలిసి వుంటుంది—"

"మీ ఆజ్ఞ బాబూ, తెలిసింది చెప్పడానికెప్పుడూ సిద్ధమే—మొదటి సాక్ష్యం అంటే, అసలు మొత్తం మనవేపు—"

"త్రిమూర్తులూను—"

"ముగ్గురు సాక్షులా అండి?—నేనూ—రెండోది?—"

"ఆ పటం!—"

"మూడోది?"

"భగవంతుడు!—" అని మూర్తిగారు పెద్ద నిశ్వాసం విడిచాడు. కారు బయలుదేరింది.

* * * *

మర్నాడు కోర్టులో గోపాలంగారు వాఙ్మూలం యిచ్చాడు. గంగమ్మ శీల ప్రవర్తనలుగురించి తనకి తెలిసిన సంగతులు చెప్పాడు. అనేకసార్లావిడ, తన పిల్లవాడి అందచందాలు చెప్పుకు వాపోయేదనీ, ఆ పోలికలన్నీ యిప్పుడు చోరీ అయిందన్న పటంలో స్పష్టంగా వున్నాయనీ, తెలియజేశాడు.

ఆ రోజున, 'ప్రజాశంఖం' పత్రిక ధర్మమా అని కోర్టుగది ప్రేక్షక జనంతో కిటకిటలాడింది. ఎన్నో కేసులలో మూర్తిగారి వాదనలు విన్నవాళ్లు, అంత వుద్రిక్తుడై ఎప్పుడూ ఆయన మాట్లాడలేదని ఆశ్చర్యపడ్డారు—

చాలా నీరస స్థితిలో వున్నా, ముద్దాయి నారోజున హాజరు పెట్టారు—ముడి విడిపోయిన ఆజుట్టు అలాగే వ్రేలాడుతోంది; సగం నిద్రలో లేపినట్టు, కళ్లు కణకణ లాడుతున్నాయి. ఆదృష్టిలో నిర్లిప్తత—యీ కోర్టూ, ప్రజలూ, గొడవలూ దాటి—ఏలోకాలనో అందుకున్నట్టుంది. అమ్మవారి జాతరలో గణాచారిలాగ, ఆవిడ దేహం వూగిపోతోంది. బోనెక్కే ముందు చెయ్యాల్సిన ప్రమాణం కూడా ఆవిడ స్పష్టంగా వల్లించలేదని ప్రాసిక్యూషనుతరఫున ఒక

అభ్యంతరం చెప్పారు. ఆవిడ ఏ ప్రశ్నలకీ సమాధానం యివ్వలేదు — అసలవి, వినిపించుకున్నట్టే లేదు. మూర్తిగారు తన రెండో సాక్షిగా హాజరు చేయించిన 'ఎక్సిబిట్' — 'బాబు' చిత్రం — ముందు పెట్టినప్పుడు మాత్రం, ఏదో మీట నొక్కినట్టావిడ చేతులు చాచింది. ముఖం మీద ఒక క్షణం ఏదో కాంతి వెలిగింది. నిద్రిస్తున్న అగ్నిపర్వతం ఒక్కసారి మళ్లీ విజృంభించినట్టు, ఆవిడ ఆపాదమస్తకం దడదడలాడింది. కాని, "మాడమ్మా — యీ బొమ్మ నీ కొడుకుదేనా — చెప్పు — దేవుని ఎదుట, ప్రమాణం చేసి — నీకన్న కొడుకేనా?" అని మూర్తి గారు గద్గద కంఠంతో ప్రశ్నించే సరికే, ఆ మహా చైతన్యం మళ్లా సమాధిలో పడిపోయింది. జల ప్రళయంలాగ బొట బొట కారిన కన్నీరే సమాధానం అయింది. "ఇంక ఆవిడ సాక్ష్యం చాలని" మేజస్ట్రేటు మహేశంగారాదేశించడంతోటే, పోలీసుజవానావిడని తీసుకుపోయాడు.

"కడుపు తీపి యెరిగిన తలిదండ్రులకి అంతకంటె రుజువక్కరలేదనుకుంటాను" అని మూర్తిగారు తన 'ముగింపు' అందుకున్నాడు. పటం పట్టుకువెళ్లినప్పుడావిడ ఒకవిధం అయిన వున్మాదావస్థలో వుందని, రామశాస్త్రి సాక్ష్యం వుదాహరించాడు. అప్పటి చర్యలకి ఆవిడ బాధ్యురాలు కాదని వాదించాడు — "ఎడారి ఎండ మధ్యలో నీళ్లు కనిపిస్తే తాగబోవడం చోరీ అవుతుందా? కీకారణ్యంలో పాంథుడు వెలుగు వేపు పరుగెత్తడం నేరమంటామా? చచ్చిన పిల్లవాడు కంటబడ్డాడనుకున్నప్పుడు తల్లి ప్రత్యణువూ పరవశం కావడం కూడా అలాంటి అనివార్యమైన, ఆధ్యాత్మిక సంఘటనే — అసలు చోరీ, ఆవిడ బ్రతుకలా బండలు చేసిన రాక్షసుడు చేసింది — గంగమ్మది కాదు — ఆ పటం ఆ తల్లిదే!" అని మూర్తి గారు కూర్చునే సరికి అక్కడి ప్రజ యావత్తూ నిస్తబ్ధులయారు.

తీర్పు వినిపించేసరి కారోజు నాలుగయింది. అవతల వానజడి తగ్గింది. పచ్చని చెట్లమీద అప్పుడే వచ్చిన నీరెండపడి పక్కమీద సుషుప్తిలో వున్న పసిపాపడి చిరునవ్వులాగ ప్రకృతి అంతా చిదానందంగా వుంది.

మేజస్ట్రేటు మహేశంగారు, తీర్పు చెబుతూ — అప్రయత్నంగానే — నుంచుండిపోయాడు. అక్కడవున్న వాళ్లకోసం కాదన్నట్టు, అతి హీనస్వరంలో ఆచి ఆచి మాట్లాడాడు - అప్పటికి ముద్దాయి అనుభవించిన ఖైదు ఆ నేరానికి తగిన శిక్ష అయిపోయింది. న్యాయదేవత ఆశయం నెరవేరిందని, వెంటనే గంగమ్మ విడుదలకి ఆదేశించాడు - "ముద్దాయి తరఫున, మూర్తిగారు - అన్నట్టు - యీ బా - బు - పటం - ఆ తల్లిదే! - ఆవిడకే - వప్పగించుతున్నాను -" అని యినస్పెక్టరు వీరాస్వామి వైపు సూచిస్తూ కవరొకటి బిల్లబంట్రోతు చేతికిచ్చాడు. ఎలా తెలిసిందో, ఒక్క క్షణంలో అక్కడి ప్రజలంతా, ఒక్క గుండెగా, "ఓహో, మహానుభావు" డని హాహాకారం లేచింది. కారణం, ఆ కవరులో వున్నది రామశాస్త్రి పేరట, ఆరువందల రూపాయలకి చెక్కు - మహేశంగారిచ్చిన 'బాబు' పటం ఖరీదు!

* * * * *

కోర్టులో ఆ కేసలా ముగిసేసరికి, అవతల మళ్లా ముసురందుకుంది. ఆ చిగిబిగి రాత్రి తొమ్మిదివరకూ కుంభపోతగా కురుస్తానే వుంది.

అప్పటికి గంగమ్మ కేసు డాక్టరు చేతులలో పడింది - ఇంటికి తీసుకొచ్చినప్పటినించీ, మాటామంతీ లేకుండా మంచంమీద పడివుంది. వొళ్లు పేలిపోతోంది. పరీక్ష చేసి, 'న్యుమోనియా' అన్నాడు డాక్టరు.

గోపాలంగారి భార్య రోగి గుండెలకి 'ప్లాస్టరు' వేసింది. మందు తాగించింది. భార్యని పిల్లల దగ్గరికి పంపించి, చెల్లెమ్మని కనిపెట్టుకుని కూర్చున్నాడాయన. ఓ రాత్రి వేళ, నూతిలో మాటలాగ ఆవిడ మూలుగు వినిపించింది -

"నా - బాబుని - కొట్టొద్దను -"

"ఎవరు కొడుతున్నారమ్మా? - అదేవో - కల -"

"మారం - పెడుతున్నాడు - ఆ గుర్రం - కోసమని -"

"నేను - తెస్తాలే, పొద్దున్నే -"

ఆవిడ వింతగా చిరునవ్వు నవ్వింది - పోలీసు ఠాణాలో ఆరు కొట్టారు -

గోపాలంగారి కలా, కుర్చీలోనే ఓ కునుకు పట్టింది - గోదావరి వొడ్డున, స్మశానాల రేవులో మహేశంగారు గొంతెత్తి గీతాపారాయణ చేస్తున్నాడు...దూరంగా, లంకమీద నుంచుని, వీరాస్వామి లాఠీ విసిరాడు...తన తల పగిలి చెంపలమ్మట నెత్తురు కారింది. కెవ్వున కేక వేసేసరికి -.పక్కనున్న మేజామీదికి వొరిగివుంది శిరస్సు. పాలగ్లాసు పడిపోయి, చంప కిందంతా మకుగయివుంది. కిటికీలోనించి ఎండకి, గది అంతా వెలుతురుగా వుంది. కళ్ళు చిట్లించుకుంటూ అటు చూసేసరికి -

అక్కడవున్న ఒక్క కుర్చీలో, మహేశంగారు! - ప్రక్కనే రామశాస్త్రి, యింకో పెద్ద మనిషీ నిలబడివున్నారు -

"క్షమించాలి - మిమ్మల్ని లేపేశాం -"

కల కాదు, నిజమే! - అది మహేశంగారి గొంతే! - ఆయన, లేచి గంగమ్మకేసి చూస్తున్నాడు-

గోపాలంగారు గమ్మున లేచాడు. నలుగురూ, వీధి వరండాలోకి వెళ్ళి మంచాలమీద కూర్చున్నారు-

"ఈయనే కృష్ణమూర్తిగార"ని రామశాస్త్రి, కలకత్తానించి ఆయనలా పరుగెత్తుకొచ్చిన కారణం చెప్పాడు. ఎక్సిబిషన్ ముగిశాక, మామూలుగా నే, తాను 'బాబు' చిత్రం కోర్టువారి స్వాధీనంలో వుందని యీ గొడవ కొంత కలకత్తా వుత్తరం వ్రాశాడట. కృష్ణమూర్తిగారు అప్పటికి వూళ్ళో లేక ఆ వుత్తరం ఆలస్యంగా చూసుకున్నాడట. వెంటనే ఆదుర్దాతో రైలెక్కాడట. ఎక్సిబిషన్ జాబితాలో ఏదో పొరబాటున యింకోదాని ఖరీదు యీ చిత్రానికి పడిందే గాని, అసలీ 'బాబు' చిత్రం అమ్మకానికని ఆయన ఎన్నడూ వుద్దేశించలేదట—

"ఆయన పటం ఆయనే స్వయంగా వప్పజెప్పాలని వచ్చార"నీ మహేశంగారన్నాడు.

"నాదేమిటి, ఆవిడదే!—ఆ తల్లే నా వేళ్ళకి కళ్ళిచ్చి వ్రాయించిందా చిత్రం— మూడేళ్ళ క్రితం మాట. నేనీవూళ్ళో ఒక నెలరోజు లుండటం తటస్థించింది. అదో పెద్ద సత్రంకొంప. అవతలి వాటాలోంచి, 'బాబు' అప్పుడప్పుడు నా గదిలోకొచ్చే స్తూవుండేవాడు. వందమంది పిల్లలలో అయినా గుర్తుపట్టగల అందం—అతని బొమ్మ వ్రాద్దామని సరదాకొద్దీ మొదలెట్టాను. ఒకనాడా కొంటె నవ్వు పట్టుకోవాలని బిస్కత్తులిచ్చి చాలా సేపు కూచోపెట్టుకున్నాను. ఆలస్యం అయేసరికి తల్లి వెతుక్కుంటూ వచ్చింది. ఏమి ఆదుర్దాపడిందో, గమ్మున 'బాబుని' ఎత్తుకుని గాఢంగా గుండెలకి హత్తుకుంది. ఆవిడ ముఖం నేను దగ్గరగా చూసిందా వొక్కసారే—కాని, ఆతన్మయత్వం, ఆనందాతిశయం, నా మనస్సులో ఆ ముఖం అచ్చొత్తుకుపోయింది. తల్లిని చంపి పుట్టిన దౌర్భాగ్యుడికా అనుభూతి, అమ్మ అంటే ఏమిటో అవగాహన చేసింది—ఆ మాతృభావం చిత్రించాలని తర్వాత చాలా మథనపడ్డాను—కాని, మళ్ళీ నే నీవూరు వచ్చేసరికి ఆవిడ ఆ యింట్లో లేదు. ఎన్నిసార్లు యత్నించినా పత్తా తెలియలేదు. 'బాబు' చిత్రం పని కాస్త వెనకబడేసరికి మాత్రం ఆ ముఖం కలొచ్చి వేధించేది. ఆ చిత్రం పూర్తయాక ఎలాగయినా వెతికి ఆ తల్లికే యివ్వాలని ముడుపు గట్టాను. ఆఖరికిలాగ ఆ సంకల్పం సఫలం చేయాలని వుద్దేశించాడు భగవంతుడు—"అని కృష్ణమూర్తిగారా సంగతంతా చెప్పేటప్పటికి గోపాలంగారికి యేదో కథలో గొడవలాగ ఆశ్చర్యం వేసింది.

గంగమ్మకి కొంచెం తెలివొచ్చాక, నెమ్మదిగా చెప్పి ఆ పటం చూపించాలని నిశ్చయించారు. కాస్సేపుండి, మహేశంగారూ, రామశాస్త్రి వెళ్ళిపోయారు. కృష్ణమూర్తిగారు మాత్రం అక్కడే వుండిపోయాడు-

ఉదయం అంతా గంగమ్మకి మగత తగ్గి సంధి మాట లెక్కువయాయి.

"అయ్యో, నా దుర్గన్నకి తలదువ్వ నేలేది వేళ" అని, దువ్వెన్న తెమ్మందోసారి "ఎంత మట్టి పోసుకున్నాడో, యీ చొక్కా విప్పెయ్యాలం"ది యింకోసారి. సూచనగా 'బాబు' పటం అందిన సంగతి చెబుతూ వచ్చాడు. గోపాలంగారు. క్రమంగా నాలుగయేసరికి, ఆవిడ కా ధోరణి తగ్గింది. చాలా తెలివిగా మాట్టాడడం మొదలెట్టింది—"చాలా— అవస్థ—పడుతున్నా వన్నయ్యా—నీ ఋణం ఎలా తీర్చుకోగల"నని కన్నీళ్ళెట్టుకుంది.

కృష్ణమూర్తిగారు 'బాబు' పటం అందిచ్చాడు. కాళ్ళు తడబడుతూ, గోపాలంగారు, మంచం దగ్గరకి తీసుకెళ్ళాడు—

"అమ్మా, యిదుగో - బాబు - " అంటూ, గొంతుక అడ్డుపడి, ఆ పటం ఆవిడప్రక్కనే వుంచాడు -

గమ్మున, గంగమ్మ కన్నులు, వింత కాంతితో విప్పారాయి. చేతులు చాచుకున్నాయి. ముఖం అంతా ఒక మూగచిరునవ్వు వెన్నెల కాసింది -

ఆ తన్మయత్వం, కృష్ణమూర్తిగారిదివరకొక సారి సందర్శించాననుకున్నాడు. కాని, యిప్పుడది, మళ్లీ చెరిగిపోకుండా శాశ్వతసమాధిని చెందింది. గోపాలంగారు, తర్వాత చెప్పుకు వాపోయినట్లు, ఆ పటం యింక అవసరం లేకపోయిందావిడకి. అసలు వస్తువునే చేరుకుందా తల్లి -

అంత్యక్రియలకేమీ లోటు రానివ్వద్దని, మహేశంగారో రెండువందల రూపాయలు పంపించాడు. కాని, "బ్రతికివున్నంతకాలం, భగవంతుడే దిక్కయాడావిడకి - యిప్పుడు మాత్రం మనిషిసానుభూతెందుక"ని ఆ డబ్బు తిప్పేశాడు. గంగమ్మ ఆస్తిశేషం, పోలీసుల చేతుల్లోంచి వచ్చిన, ఆ యాభై రూపాయలే ఖర్చుపెట్టాడాయన - చెల్లెమ్మని సంపాదించుకున్న ఆ స్మశానాలరేవులోనే మళ్లీ వప్పగించేశాడు...తల్లీ పిల్లల నక్కడే తన పొత్తిళ్లలో చేర్చుకుని, పులకించింది అఖండగౌతమి -

గోపాలంగారికి, ఆ దుఃఖంతో మతిపోతుందనుకున్నారంతా. కాని, అలాంటివి ఎన్నో దుఃఖాలని హరాయించగల కాలమాయ ముందు, ఆ స్కూలుమేస్టరెంత?- "ఉన్న పెళ్లాంబిడ్డల సంగతి చూసుకోకపోతే ఎలాగ?" అని చీవాట్లుపెట్టారు స్నేహితులు. మూడోమాసికం జరిపించాక, మళ్లీ యింకోచోట వుద్యోగానికి దరఖాస్తుపెట్టాడాయన. ఆ సందర్భంలోనే ఏవో కాగితాలు ధృవపరిపించాలిసొచ్చి, మొదటిసారిగా, మేజస్ట్రేటుగారి యింటికి వెళ్లాడొక వుదయం -

సైనుబోర్డునిబట్టి యిల్లు రూఢిచేసుకున్నాడు - ఇత్తడిప్లేటుమీద నల్లని అక్షరాలు - "పి. దుర్గామహేశం" అని వున్నాయి.

హాలులో అడుగుపెట్టేసరికి, గోపాలంగారు నిర్ఘాంతపోయాడు - మహేశంగారి కళ్లమ్మట నీళ్లు కారుతున్నాయి... మెల్లిగా, ఏదో చదువుకుంటున్నాడాయన... మేజాబల్లకి ఎదురుగా దీపారాధన చేసి వుంది - 'బాబు' పటం !

సంకోచిస్తూనే "నమస్కారం - " అన్నాడు గోపాలంగారు.

ఉలిక్కిపడ్డాడు మహేశంగారు...గమ్మున మూసేశాడా పుస్తకం -

అది భగవద్గీత.........